క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

సామర్లకోట: మండలంలోని గ్రామాల్లో **మంగళవారం** నుంచి 25వ తేదీ వరకూ **ఆధార్** శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ **డి.శ్రీలలిత** సోమవారం ఓ ప్రకటనలో **పేర్కొన్నారు**. మంగళవారం చంద్రం**పాలెం,** మాధవపట్నం-1, పీబీ దేవం-1, 23న పవర, మాధవపట్నం-2, పీబీ దేవం-1, 24న పి.వేమవరం, వీకే రాయపురం, జి.మేడపాడు-1, 25న అచ్చంపేట, పనసపాడు, జి.మేడపాడు-1లకు సంబంధించి ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు సచివాలయాలోల్లే సంప్రదించాలన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి కృషి



పెద్దాపురంలో ముప్పన రామారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీర్రాజు

పెద్దాపురం: చేనేత రంగం అభివృద్ధికి కృషి చేస్తానని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. స్థానికంగా అపర భగీరథుడు ముప్పన రామారావు జయంతిని పట్టణ చేనేత వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధి తన తండ్రి రామారావు హయాంలోనే ఆరంభమైందన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తానన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, ఏపీపీ పేరింశెట్టి మృత్యుంజయరావు, జనసేన నాయకుడు ఒబిలిశెట్టి గణేష్ మాట్లాడారు. తొలుత స్థానిక మున్సిపల్ సెంటర్‌లో రామారావు విగ్రహానికి పూలమాలలు వేశారు. పట్టణంలోని రెండు చేనేత సహకార సంఘ కార్యాలయాల్లోనూ వేడుకలు జరిగాయి. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు తూతిక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. వేట్లపాలెం- మేడపాడు మధ్యలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దీంతో మేడపాడుకు చెందిన గరికపాటి జితేంద్ర, కొంకుదురులో వెలమపేటకు చెందిన పులి శ్రీను, దేవి దంపతులు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో వేట్లపాలెం పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

సామర్లకోట: రైల్వే ఉద్యోగులు, కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సోమవారం ధర్నా చేశారు. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయాల సూచనల మేరకు స్థానిక సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం వద్ద రెండు బ్రాంచ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎం.రమేష్, మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత బేసిక్ పే మీద బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు రామసుబ్బారావు, మోహన్‌రావు, ఆయా యూనియన్ నాయకులు శ్రీధర్, టి.ఈశ్వరరావు, రామకృష్ణ, పి.త్రినాథ్, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువలు



కొమరగిరిలో గుర్రపుడెక్కతో మూసుకుపోయిన పంట కాలువ

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, యండపల్లి, కొమరగిరి గ్రామాల్లో పంట కాలువలు గుర్రపు డెక్కతో పూడుకుపోయి అధ్వానంగా మారాయి. దీంతో శివారు పొలాలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తమ సొంత సొమ్ములతో పంట కాలువల్లో పూడిక తీయించుకుంటున్నారు. కొన్ని చోట్ల పంట కాలువలు అధ్వానంగా ఉండడంతో సాగు నీరు ముందుకు పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలవల్లో పూడుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వరివడిగా ఖరీఫ్ సాగు



గొల్లప్రోలు మండలంలో వరి నారు తీస్తున్న కూలీలు



దమ్ము చేసిన మడిని చదును చేస్తున్న రైతు

పిఠాపురం: నియోజకవర్గంలో ఖరీఫ్ వరి నాట్లు చివరి దశకు చేరాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే నాట్లు వేయడం పూర్తవ్వగా కొన్ని చోట్ల చివరి దశలో ఉన్నాయి. ఒకే ప్రాంతంలో ఒక పక్క మెట్ట భూముల్లో వాణిజ్య పంటలు మరో పక్క మాగాణిలో వరి సాగుకు రైతులు సన్నద్ధమవ్వడంతో గొల్లప్రోలు మండలంలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారగా పంట పొలాలు కూలీలతో కళకళలాడుతున్నాయి. సకాలంలో వర్షాలు, ప్రభుత్వ పథకాలు వెరసి వ్యవసాయానికి ఊతంగా మారడంతో ఈ ఏడాది ఉత్సాహంగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే వరి నాట్లు 98 శాతం పూర్తవ్వగా వాణిజ్య పంటల సాగు చివరి దశకు చేరుకుంది.

ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓగా వెంకటలక్ష్మి

పెద్దాపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓగా సీహెచ్ వెంకటలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ కార్యాలయ ఏఓగా పనిచేసిన పద్మజ జగ్గంపేట డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ కావడంతో కాకినాడ ఆర్డీఓ కార్యాలయ ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటలక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు ఆమె ఎఫ్ఏసీ ఏఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని మండలాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రజలకు సేవలందిస్తానన్నారు. విధుల్లో చేరిన వెంకటలక్ష్మికి సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

జగన్ పాలనలో ప్రతిరోజూ పండగే

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో మహిళలకు సున్నా వడ్డీ నమూనా చెక్కు పంపిణీ



మహిళలకు సున్నా వడ్డీ పథకం నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రతి నెలా ఏదో ఒక పథకం పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నంత కాలం మహిళలకు ప్రతిరోజూ పండగేనని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులు విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమచేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. మహిళా సంఘాల యానిమేటర్లకు నెలకు రూ.3 వేలు ఉన్న వేతనాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.8 వేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి మహిళా తన సొంత కాళ్లపై తాను నిలబడి కుటుంబాన్ని పోషించుకునేలా చేసిన సీఎం వైఎస్ జగన్ పట్ల మహిళా లోకం ఆనందాన్ని వ్యక్తం చేస్తోందన్నారు. టీడీపీ హయాంలో మహిళలకు తగిన గుర్తింపు గాని, ఆర్థిక సహాయం గాని అందేది కాదన్నారు. ప్రస్తుతం మహిళలు ప్రభుత్వ తోడ్పాటుతో వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మహిళలను వ్యాపార వేత్తలుగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా కుటీర పరిశ్రమలు, మహిళా మార్టులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మహిళా మార్టుల ద్వారా అన్ని కుటుంబాలకు నాణ్యమైన వస్తువులు తక్కువ ధరలకే అందించడం చాలా గొప్ప విషయం అని కొనియాడారు. పిఠాపురం నియోజకవర్గంలోని 50 గ్రామ పంచాయతీల్లో 5099 మహిళా సంఘాలకు చెందిన 52732 మంది మహిళలకు రూ.6,43,13,071 వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద నాలో విడత ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నమూనా చెక్కును అందించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగల బాబ్జీ, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు యానిమేటర్లు పాల్గొన్నారు.

'స్పందన'కు ఎనిమిది అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి

పెద్దాపురం: డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఎనిమిది అర్జీలు వచ్చాయని పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని, స్థల ఆక్రమణ ఖాళీ చేయించాలని, తొలగించిన విద్యుత్ మీటర్‌ను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై ఎనిమిది ఫిర్యాదులు అందాయన్నారు. అనంతరం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఎల్‌పీఓ బాలామణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ధర్నా

పెద్దాపురం: ఓటీఎస్‌లో రూ.15 వేలు చెల్లించిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటీఎస్ పేరుతో లబ్ధిదారుల నుంచి సొమ్ము వసూలు చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఓటీఎస్ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మికు వినతిపత్రం అందజేశారు. నీలపాల సూరిబాబు, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం మహారాజా సేవలు మరువలేం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- శ్రీసంస్థానంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పిఠాపురం మహారాజా రావువెంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ విద్యాభివృద్ధికి చేసిన సేవలు అజరామమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం శ్రీసంస్థానంలో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం మహారాజా తన ఆస్తులను పేదల ఆకలి తీర్చడానికి దానధర్మాలు చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా పిఠాపురం శ్రీసంస్థానంలో విద్యార్థులకు భోజన వసతి సౌకర్యం కల్పించడం ద్వారా పేద విద్యార్థులకు అండగా ఉంటున్నారన్నారు. ఏటా వందల మంది విద్యార్థులకు ఇక్కడ అన్నదానం జరుగుతోందని ఆయన తెలిపారు. ధార్మిక కార్యక్రమాల కోసం రాజావారు సుమారు 400 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. ఆయన ఆశయాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వదిలేస్తున్నారు..

- విచ్చలవిడిగా పశువుల సంచారం
- రాత్రి సమయాల్లో ఇబ్బందికరం



సామర్లకోటలో రోడ్డుపై తిరుగుతున్న ఆవులు

సామర్లకోట: అడిగేవారు లేక ఇష్టారాజ్యం అయ్యింది. సామర్లకోటలో రోడ్లపైకి కొందరు పశువులను వదిలేయడంతో వాహనచోదకులు నరకం చూస్తున్నారు. ఆవులకు మేత లభించక రోడ్లపై లభించే ఆకులు, ప్లాస్టిక్ కవర్లను తింటున్నాయి. రాత్రి సమయంలో గుంపులు, గుంపులుగా దారుపై బైఠాయించడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. స్థానిక బ్రౌన్‌పేట, ప్రతిపాడు జంక్షన్, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్‌లలో ఈ సమస్య అధికంగా ఉంది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అయినా మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. రోడ్లపై విచ్చలవిడిగా విడిచి పెడుతున్న ఆవులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకొని యజమానులకు అపరాధ రుసుం విధించాలనే డిమాండ్ ఉంది. ఇప్పటికైనా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



రోడ్లపై పశువులు బైఠాయించడంతో రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తిరిగి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తాం.

-పిట్టా సత్యనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

సమస్యను పరిష్కరిస్తాం



మున్సిపాలిటీకి కొత్తగా కమిషనర్‌గా వచ్చిన తరువాత ఇటీవల రాత్రి సమయంలో రోడ్లపై బైఠాయించిన ఆవులను గమనించాం. రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరిస్తాం. అవసరమైతే ఆవులను గోశాలకు తరలిస్తాం.

-కె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

యాదవ సంక్షేమ సంఘ భవనానికి స్థలం

ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు



సత్యనారాయణ, జెడ్పీటీసీ తదితరులను సత్కరిస్తున్న యాదవ సంఘ ప్రముఖులు

కాకినాడ రూరల్: ఏళ్ల తరబడి జిల్లాలోని యాదవ సంఘ నాయకులు, కులస్తులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. కాకినాడ జిల్లా యాదవ సంక్షేమ సంఘ సామాజిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థలం కేటాయించారు. వాకలపూడిలో విలువైన స్థలం కేటాయించడంతో యాదవ కులస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తమ వినతి మేరకు స్థలం కేటాయించిన కన్నబాబును వారు సోమవారం కలసి ధన్యవాదాలు తెలియజేశారు. వాకలపూడిలో స్థలం వద్దకు చేరుకుని పరిశీలించడంతో పాటు కన్నబాబు తండ్రి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీలను సత్కరించి తమ అభిమానాన్ని చాటారు. సంఘ నాయకులు ఒమ్మి రఘురామ్, అల్లి రాజబాబు, జిల్లా యాదవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మసుమేను గంగయ్య, కోశాధికారి పి.మహేష్, కార్యదర్శి కె.బాబూరావు, యూత్ ప్రెసిడెంట్ నేమాల బాబీ, కార్యదర్శి నమ్మి లక్ష్మణ, ఇసరపు అప్పారావు, తదితరులు పాల్గొని త్వరలోనే యాదవ సంక్షేమ సంఘ సామాజిక భవన నిర్మాణం చేపడతామన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి భజన పోటీలు



భజన సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని యండపల్లి పల్లపు వీధి వినాయకుని ఆలయం ఎదురుగా 21 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి మహిళా భజన పోటీలు సోమవారంతో ముగిశాయి. మహిళా భజన పరిషత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విగ్రహ పతిష్ఠను పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మలుపు... ప్రమాదాలకు పిలుపు



కొత్తపల్లి-కొమరగిరి రోడ్డులోని మలుపులో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కొత్తపల్లి: మండలంలో కొత్తపల్లి-గోర్స రహదారిలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గంలో ఎస్, ఎల్, యూ ఆకారంలో మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవించి వాహన చోదకులు క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు ప్రమాదాల నియంత్రణ కోసం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. కొమరగిరి శివారులోని ప్రైవేటు పాఠశాల వద్ద మలుపులో కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురై కాలవలో పడి క్షతగాత్రులవుతున్నారు. ఇటీవల కాలువలో పడి ఒక వ్యక్తి మతి చెందాడు. ఆర్అండ్‌బీ అధికారులు ఈ మలుపులో ఎటువంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

కాకినాడ: మానసిక ఒత్తిడిని అధిగమిస్తే విజయం సొంతం అవుతుందని కస్టమ్స్ శాఖ కమిషనర్ సాధునరసింహారెడ్డి అన్నారు. కాకినాడ కస్టమ్స్ హౌస్‌లో విధి నిర్వహణలో ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశంపై సోమవారం ఉద్యోగులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 'ప్రశాంతమైన మనస్సు- సంతోషకరమైన హృదయం- నాయకత్వం' అనే అంశంపై బ్రహ్మకుమారిల ప్రతినిధి బీకే శీల వివరించారు. ఈ సందర్భంగా సాధునరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి వృత్తిలో ఒత్తిడి సహజమని, అయితే ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ ఆ ఒత్తిడిని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో కస్టమ్స్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.విజయ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వీరవెంకటరెడ్డి, సూపరింటెండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

త్వరలోనే మళ్లీ డివిజన్ పర్యటనలు

కాకినాడ: గడప గడపకూ మన ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేందుకు త్వరలోనే అన్ని డివిజన్లలో తిరిగి పర్యటిస్తానని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక 35వ డివిజన్‌లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలసి ఆయన ఇంటింటా పర్యటించారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనతో అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. కాకినాడలో ఐదు డివిజన్ల పరిధిలోని 16 సచివాలయాల్లో మాత్రమే గడప గడపకూ మన ప్రభుత్వం జరగాల్సి ఉందని, సెప్టెంబర్ 10వ తేదీకి అది కూడా పూర్తి చేయాలని షెడ్యూల్ నిర్ణయించుకున్నామన్నారు. అనంతరం ఇచ్చిన హామీలను అమలు చేసిన విషయాన్ని ప్రజలకు వివరించేందుకు డివిజన్ బాట పడతామన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి ఉన్నారు.

• అమ్మో.. భయం.. భయం



సామర్లకోట: అటుగా ప్రమాదం పొంచి ఉంది.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన నెలకొంది. వేట్లపాలెంలో ప్రసిద్ధ భేతాళస్వామి ఆలయం కూడలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందే ఎత్తులో ఉంది. ఇటుగా పలు పాఠశాల విద్యార్థులు, వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇది కేవలం మూడడుగుల ఎత్తులో ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలని మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి తెలిపారు. దీనిపై ట్రాన్స్‌కో ఏడీఈ ఎల్ఎల్ఎన్ కిరణ్‌ను వివరణ కోరగా మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

• కష్టాలు దాటించండి



సామర్లకోట: మురుగు పోయేందుకు తవ్వారు.. ముప్పు తిప్పలు తెచ్చారు.. వేట్లపాలెం గూడపర్తి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో పరిస్థితి ఇది. గూడపర్తి వద్ద మురుగు పోయేందుకు రోడ్డును తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. చిన్న వాహనాలతో పాటు కార్లు, ట్రాక్టర్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కెనాల్ రోడ్డు బస్టాప్ నుంచి పీహెచ్‌సీకి గూడపర్తి రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మోషేను వివరణ కోరగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో రోడ్డును తవ్వారని, దానిని పూడ్చి వేస్తామని చెప్పారు.